క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పొన్నూరు: మండలంలోని పచ్చలతాడిపర్రు గ్రామ పంచాయతీని బుధవారం జిల్లా ప్రజా పరిషత్ సీఈవో వి.జ్యోతి బసు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న తాగు నీటి సరఫరా, ఇంటింటి చెత్త సేకరణ, శానిటేషన్ పనులను పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించి.. నిర్వహణపై గ్రామ కార్యదర్శి రవిబాబుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎంపీడీవో నారాయణ రావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, ఏఈ నాగేశ్వరరావు, స్వచ్ఛ భారత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, క్లాప్, డి.పి.ఆర్.సి సిబ్బంది పాల్గొన్నారు.

పంట సాగుదారుల చట్టంపై ప్రచారం



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ కూరపాటి నిర్మల ఆధ్వర్యంలో పంట సాగుదారుల చట్టంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కరుణకుమార్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కె.శివపార్వతిలతో కలిసి పంట సాగుదారుల చట్టంకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ప్రత్తిపాడు-1, 2 సచివాలయాల్లో సిబ్బంది, రైతులకు అవగాహన కల్పించారు.

ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య



ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించనున్నామని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీవో జి.విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని అంగన్‌వాడీ సెంటరును బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు, అటెండెన్స్ రిజిష్టర్లు, స్టాక్‌రిజిష్టర్లను ఆమె పరిశీలించారు. ఫీల్డ్‌లో సర్వేలో నమోదైన చిన్నారులంతా కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ చిన్నారులను అంగన్‌వాడీలకు పంపాలని సూచించారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రత్తిపాడు: ఐసీడీఎస్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయినప్పటికీ అంగన్‌వాడీలకు కనీసం ఉద్యోగ భద్రత లేదని ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి తెలిపారు. సమస్యల సాధనలో భాగంగా అశువులు బాసిన అంగన్‌వాడీలకు సంతాపాన్ని తెలుపుతూ బుధవారం ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అండ్ మినీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అంగన్‌వాడీల బ్లాక్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాణాలు కోల్పోయిన అంగన్‌వాడీలకు సంతాపాన్ని తెలుపుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కేంద్రాలకు నల్ల దుస్తులతో హాజరై సంతాపాన్ని తెలియజేసారు. జ్యోతిరాణి మాట్లాడుతూ.. కార్మిక సంఘాల పిలుపులో భాగంగా గతంలో 42 రోజుల పాటు అంగన్‌వాడీలు సమ్మెలో పాల్గొన్నారని, ఆ సమయంలో 13 మంది అంగన్‌వాడీలు అమరులయ్యారన్నారు. వారిని స్మరించుకునేందుకు జులై 9వ తేదీన అంగన్‌వాడీల్లో బ్లాక్ డేను ఏటా నిర్వహిస్తామని జ్యోతిరాణి తెలిపారు.

'మెగా పేరెంట్స్ డే'ను పక్కాగా నిర్వహించాలి



ప్రత్తిపాడు: మెగా పేరెంట్స్ డేను పాఠశాలల్లో కచ్చితంగా నిర్వహించాలని సమగ్ర శిక్షా ఏపీసీ పద్మావతి అన్నారు. ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం సమగ్ర శిక్షా ఏపీసీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలోని కంప్యూటర్ శిక్షణ గదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం గురువారం జరగనున్న మెగా పేరెంట్స్ డేకి సంబంధించి ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్‌ఎం అలీషాకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎంఈవో సీహెచ్ రమాదేవి, అసిస్టెంట్ జీసీడీవో సుజాత, ఏఎంవో తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



పెదనందిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

సార్వత్రిక సమ్మెలో గళమెత్తిన కార్మికులు

- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్
- ఎర్ర జెండాలతో ర్యాలీగా కదిలిన కార్మికులు
- ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని వినతి

ప్రత్తిపాడు: లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎర్ర జెండాలతో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఆటో, రవాణారంగ, అసంఘటిత కార్మికులు ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ జి.కరుణకుమార్‌కు తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ప్రత్తిపాడు మండల అధ్యక్షురాలు కె.జ్యోతి కార్యక్రమానికి అధ్యక్షతన వహించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ధనలక్ష్మి, ఆటో యూనియన్ అధ్యక్షుడు గాలి నాగరాజు, నాయకులు కె.ఆదినారాయణ, సుభాషిని, స్వాతి, యాకోబు, భారతి, రమణ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరులో..

వట్టిచెరుకూరు మండలంలో అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీ వర్కర్, బ్యాంకు ఉద్యోగులు సమ్మె నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి మెయిన్ సెంటరు వరకు ప్రదర్శన నిర్వహించారు. ముట్లూరులో బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల మొత్తం కాలరాస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. నాయకులు నాగరాణి, భాను, నవరత్నమణి, లక్ష్మి, అనురాధ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



వట్టిచెరుకూరులో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెదనందిపాడులో..

పెదనందిపాడులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్‌హేనాప్రియకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామిక మహిళా సంఘం జిల్లా కార్యదర్శి జి.రమణ, సీఐటీయూ నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం నాయకులు జంపని రామారావు పాల్గొన్నారు.

ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించాలి



సమ్మెలో మాట్లాడుతున్న రామారావు

పొన్నూరు: ఆటో రంగాన్ని పరిశ్రమగా గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు ఆరేటి రామారావు, పుప్పాల సత్యనారాయణ అన్నారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు సమ్మె నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ నగర అధ్యక్షులు గోవిందరాజులు అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేలా ఉన్నాయని రామారావు అన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎం.సత్యనారాయణ, కూచిపూడి రత్నబాబు, వెంకయ్య, ప్రసాదు, ప్రకాష్, సీతారామయ్య, పొన్నూరు పట్టణ ఆటో వర్కర్స్ పాల్గొన్నారు.



ధర్నాలో సీఐటీయూ నాయకులు



పెదకాకాని సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెదకాకాని: కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.రాజలక్ష్మి అధ్యక్షత వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అంగన్‌వాడీలు, పంచాయతీ కార్మికులు, డ్వాక్రా యానిమేటర్లు, ఆటో సంఘాలవారు, రైతు సంఘం నాయకులు, పలు సంఘాల నాయకులు సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. పంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ.. మోటార్ వాహనాల చట్టం సవరణ జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని అన్నారు. అనంతరం పెదకాకాని సెంటర్ నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్‌కు తమ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్, మండల అధ్యక్షులు కె.కొండలు, ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు యస్‌కే సుభాష్ చంద్రబోస్, కె.కీర్తి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.రాజలక్ష్మి, ఇ.హిందూవాణి, పి.అంజనాదేవి, వర కుమారి, వీవోఏ జిల్లా కార్యదర్శి పద్మ, ఏడుకొండలు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు యాకోబు, వెంకటరావు, కె.గోపి, కౌలు రైతు సంఘం నాయకులు ఎస్ నీలాంబరం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, బి.బాబురావు, ఉల్లంగుల శివయ్య, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. పెదకాకాని సెంటర్‌లో ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఏఎన్‌యూలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

ఏఎన్‌యూ: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు 2కే రన్, బ్లడ్ గ్రూప్ క్యాంప్, రక్తదాన శిబిరం, నేత్ర దాన ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌యూ శాఖ ఉపాధ్యక్షుడు హేమంత్ రామ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని జాతీయ విద్యార్థి దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన వి.రామారావు (సాక్ష్యం స్టేట్ సెక్రెటరీ) మాట్లాడుతూ సామాన్య విద్యార్థి స్థాయి నుంచి అసామాన్య పౌరునిగా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నటువంటి విద్యార్థి సంఘం ఏబీవీపీ అని తెలిపారు. ఏఎన్‌యూ కామర్స్ విభాగాధిపతి ఆర్.శివరామ్ ప్రసాద్, ఏబీవీపీ రాష్ట్ర టెక్నికల్ సెల్ కన్వీనర్ మోహన్ రావు, రాష్ట్ర సోద్ కన్వీనర్ రమాకాంత్, విశ్వవిద్యాలయాల కన్వీనర్ గంగాధర్ మాట్లాడారు. రాష్ట్ర ఎస్ ఎఫ్‌డీ కో కన్వీనర్ శివ గణేష్ పాల్గొన్నారు.

టీటీడీలో పనిచేసే హిందూవేతరులను ఆదుకోవాలి

చేబ్రోలు: టీటీడీలో చాలా మంది ఎంప్లాయిమెంట్ ద్వారా క్రైస్తవులు, ముస్లింలు పనిచేస్తున్నారని.. వారిని సస్పెండ్ చేయకుండా కొండ మీద కాకుండా వేరే చోట పనిచేసే విధంగా ఉపయోగించుకోవాలని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ మోసగంటి జోసఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో టీటీడీలో అన్ని వర్గాలు, మతాల వారు మత సామరస్యంతో ఉండేవారన్నారు. ఇప్పుడు వారు మూడు, నాలుగు ఏళ్లల్లో రిటైర్ అయ్యే స్థాయిలో ఉన్నారని తెలిపారు. మానవతా దృక్పథంతో వారిని సస్పెండ్ చేయకుండా వేరే ప్రాంతంలో ఉపయోగించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు జోసఫ్ ఆ ప్రకటనలో తెలిపారు.

పరిశ్రమల అవసరాలకు దీటుగా తీర్చిదిద్దాలి



గుంటూరు ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచంలో ఉద్యోగాలను సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలతో పాటు పరిశ్రమల అవసరాలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వృత్తిలో రాణించడం ఎలా అనే అంశంపై వారితో చర్చించారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ 2023–25 బ్యాచ్‌కు చెందిన 12 మంది విద్యార్థులు వివిధ ప్రముఖ ఆస్పత్రుల్లో ఫ్రంట్ డెస్క్ మేనేజర్, సర్వీస్ మేనేజర్, డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్‌గా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ కళ్యాణి, సహాయాచార్యులు బాజీబాబు, వేదవతి, షేక్ షబానా పర్వీన్, అభిలాష్, అనిత, రాజేశ్వరిదేవి, వెంకట కళ్యాణ్ పాల్గొన్నారు.

వీవీఐటీ విశ్వవిద్యాలయంతో పర్డ్యూ యూనివర్సిటీ ఎపిక్స్ ప్రోగ్రాం



డాక్టర్ విలియమ్స్ వోక్స్‌ను సత్కరిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక పర్డ్యూ యూనివర్సిటీలో ప్రారంభించిన ఎపిక్స్ కార్యక్రమాన్ని మండలంలోని నంబూరు వీవీఐటీ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎపిక్స్ కార్యక్రమంలో భాగంగా పర్డ్యూ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ విలియమ్ వోక్స్ వీవీఐటీ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులు, ఆధ్యాపకులతో ఇంటరాక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ సర్వీసెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా వీవీఐటీ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌లను విద్యార్థులు వివరించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభను ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిటీలలో మంచి కోసం వినియోగించేలా ఈ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. అనంతరం ప్రొఫెసర్ డాక్టర్ విలియమ్ వోక్స్ మాట్లాడుతూ.. సాంకేతిక వినియోగం ద్వారా ప్రపంచ సవాళ్లు అధిగమించేలా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, సీఎస్పీ సంధానకర్త డాక్టర్ ఐఎల్‌జే భక్తసింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలి



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

పొన్నూరు: పట్టణ పరిధిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి స్థానిక పంట పొలాలను సందర్శించారు. కార్యక్రమంలో లాంఫారం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్.దయానాగ్రేస్ పాల్గొని రైతులకు వరి పైరులో విత్తన శుద్ధి ప్రాముఖ్యతను వివరించారు. ఏవో ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కౌలు రైతులు తప్పని సరిగా సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, ఎంపీఈవో, ఎస్‌కే జయశ్రీ, వి.ప్రియాంక, ఎస్.సురేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ సుగుణబేగం అన్నారు. ప్రత్తిపాడు మండలం వంగిపురం, మేదావారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో రైతులకు డిజిటల్ క్రాప్, పంటల నమోదు, రాయితీపై డ్రోన్లు, విత్తనశుద్ధి, పంటలమార్పిడి.. వంటి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది అల్లా బక్షు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేనేజర్

పొన్నూరు: ప్రతి వ్యక్తి సంపాదనలో 20 శాతం పొదుపు చేయడం అనేది భారతీయ రిజర్వ్ బ్యాంకు ముఖ్య ఉద్దేశ్యమని.. దీనిని ప్రతి ఒక్కరూ పాటించాలని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో భారతీయ రిజర్వు బ్యాంక్ సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ బ్యాంకు మేనేజర్ రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రతి మహిళా పొదుపు చేయడం ద్వారానే ఆర్థికాభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని అన్నారు. సాల్మన్ పాల్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ సర్వే ప్రకారం పురుషుల కంటే మహిళలు సంపాదనలో 84 శాతం పొదుపు చేస్తున్నారని తెలిపారు. ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి సురక్ష లాంటి బీమా సౌకర్యాలను కలిగి ఉండాలని కోరారు. అనంతరం బ్యాంకులు అందించే పథకాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఎంఎం డి.హనుమ నాయక్ , కమ్యూనిటీ ఆర్గనైజర్స్ సీహెచ్ రావమ్మ, విశ్వనాథం, ఆర్ లక్ష్మీ, సీఎల్ఎఫ్ ప్రెసిడెంట్ నాగ పద్మావతి, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: పారదర్శక ఎన్నికలకు, స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందించడంలో బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌ఓ)ల పాత్ర కీలకమని, బీఎల్‌ఓలు ఎన్నికల నిబంధనలు, చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని గుంటూరు తూర్పు 95 నియోజకవర్గ ఈఆర్‌ఓ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడీఈఎం) ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ 94, తూర్పు 95 నియోజకవర్గాల బీఎల్‌ఓలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీఎల్‌ఓలు క్షేత్ర స్థాయిలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. ఎన్నికల విధులు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉంటుందని, నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విధుల్లో ఏమైనా సందేహాలు ఉంటే సూపర్‌వైజర్లు, ఏఈఆర్‌ఓల దృష్టికి తీసుకురావాలన్నారు. విధుల్లో భాగంగా అందే ప్రతి క్లెయిమ్‌కి తప్పనిసరిగా ఫైల్ నిర్వహించాలని, అందులో సదరు క్లెయిమ్ సపోర్ట్ డాక్యుమెంట్స్, పబ్లికేషన్ ఫారాలు, నోటీసు, నోటీసు ఇచ్చినట్లు ఎకనాలడ్జ్మెంట్, బీఎల్‌ఓ రిమార్క్స్, ఆమోదించినా, రిజెక్ట్ చేసినా ప్రొసీడింగ్స్, ప్రొసీడింగ్స్ దరఖాస్తుదారుకి అందినట్లు ఎకనాలడ్జ్మెంట్ వంటివి తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నగరంలోని గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల బీఎల్‌ఓలకు జరుగుతున్న దశల వారీ శిక్షణలో బీఎల్‌ఓ విధులు, ఎన్నికల నిబంధనలు, చట్టాలపై తెలుసుకోవచ్చన్నారు. అనంతరం బుధవారం శిక్షణ అనంతరం బీఎల్‌ఓలకు పెట్టిన పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ప్రశంస పత్రాలను అందించారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ 94 నియోజకవర్గ ఈఆర్‌ఓ, నగర అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఏఈఆర్‌ఓలు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, రాంబాబు, సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ పద్మనాభరావు, డిప్యూటీ తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం మత్తులో హల్‌చల్

- పొన్నూరు తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులపై విరుచుకుపడిన ఇరువురు వ్యక్తులు
- తమ అర్జీని ఎందుకు పరిష్కరించలేదంటూ సిబ్బందితో దుర్భాషలు

పొన్నూరు: పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులకు భద్రత కరువైంది. తాము చెప్పింది ఎందుకు చేయలేదంటూ ఉద్యోగులతో అమర్యాదగా వ్యవహరిస్తూ దుర్భాషలాడుతుండటంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలోకి వచ్చి హల్‌చల్ చేశారు. తాము ఇచ్చిన అర్జీని ఎందుకు పరిష్కరించలేదని కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సుశీల్‌పై విరుచుకుపడ్డారు. నానా దుర్భాషలాడుతూ ఇబ్బందులకు గురిచేశారు. తాము ఆషామాషీ మనుషులం కాదని, తమాషాగా ఉందా అంటూ.. తమ పని ఆగడానికి వీల్లేదని ఉద్యోగిని హెచ్చరించారు. కార్యాలయం సూపరింటెండెంట్ ఆరేటి మాధవి అక్కడికి చేరుకుని రికార్డు మీకు ఇవ్వాల్సిన పని లేదని, ఇక్కడి నుంచి వెళ్లాలని చెప్పడంతో.. ఆమెతో సైతం దురుసుగా మాట్లాడారు. వీడియో తీస్తున్న పలువురిపై వెంటనే డిలీట్ చేయాలని దౌర్జన్యానికి దిగారు. ఈ సంఘటనతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై కార్యాలయం సూపరింటెండెంట్ ఆలేటి మాధవి మాట్లాడుతూ కార్యాలయంలో జరిగిన సంఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. అర్జీతో సంబంధం లేని వ్యక్తి దుర్భాషలాడుతూ ఉద్యోగితో అమర్యాదగా వ్యవహరించాడన్నారు. కార్యాలయంలోని సీసీ ఫుటేజీలో జరిగిన సంఘటన దృశ్యాలన్నీ రికార్డయ్యాయని తెలిపారు.

గంజాయి స్వాధీనం



నెహ్రూనగర్: నగర పరిధిలోని శివనాగరాజుకాలనీకి వెళ్లే మార్గంలో అన్నమయ్యనగర్ రెండో వీధిలో గంజాయి తాగుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు గుంటూరు- 1 టౌన్ ఎక్సైజ్ సీఐ బి.లత తెలిపారు. గంజాయి ఉన్నట్లు సమాచారం మేరకు శివనాగరాజు కాలనీకి చెందిన బత్తుల గోపి, రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన కుంభ కార్తీకేయ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 223 గ్రాముల స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎండీ కె. షరీఫ్, పి.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పూర్ణచంద్రరరావు, వి.బసవేశ్వరరావు, బి.వీరాంజనేయులు, టి.చినగోపి, టి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.